తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

హైదరాబాద్ - రంగారెడ్డి

మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్

శనివారం

4 జూలై 2026

పేజీలు : 08

Follow :





సుమారు 400 ఏళ్ల చారిత్రక విశిష్టత కలిగిన అల్వాల్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అధికారుల నిర్లక్ష్యం, సిబ్బంది అక్రమాలు భక్తుల నమ్మకాన్ని కోల్పోయే స్థితికి చేరుకున్నాయి. నిబంధనల ప్రకారం ఉదయం 6 గంటలకు తెరుచుకోవాల్సిన గర్భగుడి తలుపులు ఆరున్నరకు కూడా తెరుచుకోవడం లేదు. అన్నదానం పేరిట రసీదులు లేకుండా భారీగా వసూళ్లు చేస్తున్నారని, హారతి పళ్లంలో వేసే భక్తుల కానుకలను సైతం సిబ్బంది జేబుల్లో వేసుకుంటున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. ఈవో కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న భక్తులు, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు తక్షణం స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# హారతి పళ్లానికి కత్తెర

## ఆరున్నరకు కానీ తెరుచుకోని గర్భగుడి తలుపులు

- అన్నదానం పేరిట రసీదులు లేని వసూళ్లు
- పట్టించుకోని ఈవో.. ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భక్తులు

**మల్కాజిగిరి జూలై 3 (జనంసాక్షి) :** సుమారు 400 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర, ఎంతో విశిష్టత కలిగిన అల్వాల్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం అధికారుల నిర్లక్ష్యం, సిబ్బంది ఆసరాగా సాగుతున్న అక్రమాలతో భక్తుల నమ్మకాన్ని కోల్పోయే స్థితికి చేరుకుంది. ఆలయంలో నియమ నిబంధనలు గిరి దాటుతుండటంతో నిత్యం స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రతిరోజూ ఉదయం 5:00 గంటలకే ప్రధాన అర్చకులు, ఆలయ సిబ్బంది దేవాలయానికి చేరుకోవాలి. గుడిని శుద్ధి చేసి, స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి, ఉదయం 6:00 గంటలకల్లా భక్తులకు దివ్య దర్శనం కల్పించాల్సి ఉంటుంది. కానీ, ఆలయ సిబ్బంది బద్ధకంతో ప్రతిరోజూ ఉదయం 6:30 గంటలైనా ఆలయ తలుపులు తీయడం లేదు. దీంతో ఉదయమే స్వామివారిని దర్శించుకోవాలని వచ్చే వృద్ధులు, మహిళలు, ఉద్యోగులు గంటల తరబడి గుడి బయటే వేచి ఉండాల్సి వస్తోంది. సమయానికి తలుపులు తీయకపోవడంపై ప్రశ్నిస్తే సిబ్బంది భక్తులపైనే రుసరుసలాడుతుండటంతో భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఆలయంలో అక్రమ వసూళ్ల పర్వం జోరుగా సాగుతోందని భక్తులు వాపోతున్నారు. ప్రతి శనివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమాన్ని ఆసరాగా చేసుకుని, కొందరు సిబ్బంది భక్తుల నుంచి 2000, 3000, 5000 చొప్పున భారీగా నిధులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ వసూళ్లకు సంబంధించి ఎలాంటి అధికారిక రసీదులు ఇవ్వడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా, స్వామివారికి కర్పూర హారతి ఇచ్చే సమయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో హారతి పళ్లెంలో వేసే కానుకలను సైతం అర్చకులు, కొందరు సిబ్బంది చాకచక్యంగా తమ జేబుల్లో వేసుకుంటున్న దృశ్యాలు భక్తులను విస్మయానికి గురిచేస్తున్నాయి. ఆలయంలో ఇంత జరుగుతున్నా, వీటన్నింటికీ బాధ్యుడైన ఆలయ ఈవో కనీసం పట్టించుకోవడం లేదని, అంతా తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చారిత్రాత్మక దేవాలయ పవిత్రతను కాపాడాలని, తక్షణమే దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్న ఆలయ సిబ్బందిపై, ఈవోపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

# గృహ చోరీ కేసు ఛేదన

- వాచ్‌మన్‌తో పాటు ముగ్గురు అరెస్ట్
- రూ.20.20 లక్షల నగలు, వెండి స్వాధీనం
- ఇంటికి తాళం వేసి వెళ్లిన కుటుంబాన్ని లక్ష్యం చేసుకున్న దొంగలు
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి : పోలీసులు
- అల్వాల్ పోలీసుల చొరవతో ముఠా ఛేదన



లోపలి పేజీలో

## బహిరంగ సభల్లో గొలుసులు ఎత్తేసిన

# దొంగల ముఠా అరెస్ట్

*15 తులాల బంగారం, రూ.2.55 లక్షల నగదు స్వాధీనం*

- సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి.. డీసీపీ సూచన
- బీఆర్ఎస్ సభలో దొంగతనాలు.. పోలీసుల చొరవ
- మహేశ్వరం పోలీసులు గుట్టురట్టు



# ప్రభుత్వ పాఠశాలలో

## మూతపడితే సమాజానికి నష్టం

- పాఠశాలలో మూసివేత ఆలోచనలను ఆపాలి.
- టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటరత్నం

2



# ఆపరేషన్ ముస్కాన్‌తో చిన్నారులకు కొత్త జీవితం

## తల్లి ఒడికి చేర్చే బృహత్ కార్యక్రమం

- సైబరాబాద్ పోలీసుల చొరవ.. 7 బృందాలు
- మిస్సింగ్, ట్రాఫికింగ్ బాలల రక్షణకు సమన్వయం
- ప్రజల సహకారం కోరిన సిపి





**శేరిలింగంపల్లి, జూలై 3 (జనం సాక్షి):** అనివార్య కారణాలవల్ల దారి తప్పిన చిన్నారుల జీవితాలలో వెలుగును నింపడమే లక్ష్యంగా సైబరాబాద్ పోలీసులు 'ఆపరేషన్ ముస్కాన్-12' కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. ఈ మేరకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ ఆధ్వర్యంలో మిగితా 2లో

# మంత్రి పర్యటనకు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలి

## జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి

**చేవెళ్ల, జూలై 03 (జనంసాక్షి) :** మంత్రి శ్రీధర్ బాబు పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలి అని జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం చేవెళ్ల మండలం ముడిమ్యాల్ గ్రామపంచాయతీలో మంత్రి పర్యటన ఏర్పాట్లపై మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. పరిశుభ్రత, తాగునీరు, రహదారులు, ఇతర మౌలిక వసతుల కల్పనపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యత, పరిశుభ్రత, పాఠశాల సౌకర్యాలపై ఆరా తీసి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ



చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీలత, డీఎల్‌పీఓ (చేవెళ్ల డివిజన్) సతీష్ రెడ్డి, ఎంపీడీఓ ఎం.బన్సీలాల్, ఎంపీఓపి.విట్టలేశ్వర్ జీ, చేవెళ్ల మండల అధికారులు, గ్రామ సర్పంచ్ గౌడిచేర్ల శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో మూతపడితే సమాజానికి నష్టం

**మర్పల్లి జూలై 03 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను 29 వేల నుండి 4 వేలకు తగ్గించాలనే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలో మూత పడితే సమాజానికి పెద్ద నష్టం జరుగుతుందని టీఎస్ యుటిఎఫ్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్. వెంకటరత్నం అన్నారు. శుక్రవారం మండలంలోని వివిధ పాఠశాలల సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు మూతపడితే సమాజానికే నష్టం జరుగుతుందని, ప్రభుత్వ పాఠశాలల పైన ఆధారపడ్డ పేద ,బడుగు, బలహీనవర్గాల చదువు అండకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తూ అదేవిధంగా ఉపాధ్యాయుల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందని, సర్కారు బడులను ప్రతి ఒక్కరు కదిలి కాపాడుకోవాలని, మరో వైపు బడిలో పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడం ద్వారా తల్లిదండ్రులకు నమ్మకాన్ని కలిగించాలని, పాఠశాలలో అదనపు సౌకర్యాల కొరకు సమాజంలోని తల్లిదండ్రులు చైతన్యమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సిపిఎస్ రద్దు హామీని వెంటనే అమలు పరచాలని, పి ఆర్ సి పై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ గడువు ముగిసినందున ఈ నెల నుండి అమలు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని, పెండింగ్ లో ఉన్న బిల్లులన్నీ, డీఏలను క్లియర్ చేయాలని, మోడల్ స్కూల్ , ఎయిడేడ్ స్కూల్స్, కేజీబీవీ, యుఆర్ఎస్ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులకు ఆరోగ్యశ్రీ కార్డులు అమలు చేయాలని, ఇద్దరు ఉద్యోగుల్లో ఒకరికి మాత్రమే ప్రీమియం తగ్గించాలని, జీవో 317 తో నష్టపోయిన ఉపాధ్యాయులు వాళ్ళ సొంత జిల్లాలకు బదిలీ చేయాలని, సర్వీస్ ఉపాధ్యాయుల టెట్ పైసుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వలన తెలంగాణ రాష్ట్రంలో 80 వేల మంది ఉపాధ్యాయులపై ప్రభావం పడిందని, కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తీర్పును సమీక్షించి సెక్షన్ 23ను సవరణ సవరణ చేసి, సర్వీసు ఉన్న ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని, డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బాబురావు, మండల అధ్యక్షులు కే రమేష్, ప్రధాన కార్యదర్శి డి రవి, సుందరయ్య, వెంకటేశం, బి యాదయ్య, సైదులు, బి.రాజేందర్, జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# బహిరంగ సభల్లో గొలుసులు ఎత్తేసిన దొంగల ముఠా అరెస్ట్

**మహేశ్వరం, జూలై 3 (జనం సాక్షి):** బహిరంగ సభలు, రద్దీగా ఉండే ప్రదేశాల్లో జనాల మెడల నుంచి బంగారు గొలుసులు, నగదు ఎత్తేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను మహేశ్వరం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ముఠా సభ్యుల నుంచి 15 తులాల బంగారం, రూ. 2.55 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. జూన్ 27న మహేశ్వరం మండల కేంద్రంలోని పీఎస్ వై కన్వెన్షన్ హాల్లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్న సభలో రద్దీలో దొంగతనాలు జరిగాయి. ఈ సంఘటనపై దర్యాప్తు చేపట్టిన మహేశ్వరం పోలీసులు హైదరాబాద్ మంగర్బస్తీ, హబీబ్నగర్ ప్రాంతాలకు చెందిన కాంబ్లే కైలాష్, కాంబ్లే అరుణ్, కాంబ్లే శ్యాంసుందర్లను అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు దొంగలు పరారీలో ఉన్నారు.

మహేశ్వరం జోన్ డీసీపీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ, రాజకీయ సభలు, రద్దీగా ఉండే ప్రదేశాల్లో దొంగతనాలు చేసే ఈ ముఠాను అప్పటికప్పుడు పట్టుకోవడం ద్వారా ప్రజలకు భరోసా కల్పించామన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు, షాపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కేసులో అరెస్టు చేసిన ముగ్గురిని రిమాండ్కు తరలించారు. ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు డీసీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం ఏసీపీ జానకీ రెడ్డి, సీఐ రాఘవేందర్ రెడ్డి, ఎస్ఐలు ప్రసాద్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గృహ చోరీ కేసు ఛేదన.. వాచ్మన్తో పాటు ముగ్గురు అరెస్ట్

**అల్వాల్, జూలై 3 (జనం సాక్షి):** ఇంటికి తాళం వేసి వెళ్లిన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని గృహ చోరీకి పాల్పడిన వాచ్మన్తో పాటు చోరీ సొత్తును కొనుగోలు చేసిన మరో ఇద్దరిని అల్వాల్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.20.20 లక్షల విలువైన 13.4 తులాల బంగారు ఆభరణాలు, 330 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అల్వాల్కు చెందిన మేడిశెట్టి శ్యామ్రావు దంపతులు జూన్ 3న తమ ఇంటికి తాళం వేసి మెదక్కు వెళ్లారు. జూన్ 27న తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళాలు, బీరువా పగులగొట్టి బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదు అపహరించినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలు దర్యాప్తు ప్రారంభించాయి.

దర్యాప్తులో బాధితుల ఇంటికి ఎదురుగా ఉన్న అపార్ట్మెంట్లో వాచ్మన్గా పనిచేస్తున్న కొల్లి లోవరాజు (38)పై అనుమానం కలిగింది. సాంకేతిక ఆధారాలు, ఇతర సమాచారాన్ని పరిశీలించగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో అతడే చోరీకి పాల్పడినట్లు తేలింది. అనంతరం దొంగిలించిన బంగారు, వెండి వస్తువులను పాపనీ రాజు (45), మైలారం మహేశ్వర్ చారి (46)లకు విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి చోరీకి గురైన 13.4 తులాల బంగారు ఆభరణాలు, 330 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కేసును మల్కాజ్గిరి డీసీపీ శ్రీధర్ పర్యవేక్షణలో బేగంపేట ఏసీపీ పి. గోపాలకృష్ణమూర్తి, అల్వాల్ ఎస్హెచ్ఓ ఎ. ప్రశాంత్ ఆధ్వర్యంలో డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ కె. వీరబాబు, ఎస్ఐలు కె. చంద్రశేఖర్, ఎ. మల్లేష్, నేర విభాగం సిబ్బంది ఛేదించారు. ఇళ్లకు తాళం వేసి బయటకు వెళ్లే సమయంలో పొరుగువారికి సమాచారం ఇవ్వాలని, ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, విలువైన నగలను బ్యాంకు లాకర్లలో భద్రపరచాలని, ఇంటి పనివారు, వాచ్మన్ల వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్లో నమోదు చేయించాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

# ఆపరేషన్ ముస్కాన్తో చిన్నారులకు కొత్త జీవితం

శుక్రవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి రమేష్ మాట్లాడుతూ, ఆపరేషన్ ముస్కాన్ ద్వారా ఇంటి నుండి తప్పిపోయిన, బాల కార్మికులుగా, బిక్షాటకులుగా, ట్రాఫికింగ్కు గురైన, చెత్త సేకరణలో పడిన బాలబాలికలను గుర్తించి వారి తల్లిదండ్రుల సంరక్షణకు చేర్చడమే తమ అంతిమ లక్ష్యమన్నారు. ఈ నెల 1 నుంచి 31 వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక డ్రైవ్ ద్వారా దర్పణ్ విధానంలో పిల్లలను తల్లిదండ్రులతో సరిపోల్చి సురక్షితంగా అప్పగించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ డిసిపి సృజన నేతృత్వంలో ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని దిగ్విజయం చేసేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నట్లు సిపి వెల్లడించారు. ఏహెచ్టియు, ఇతర స్వచ్ఛంద సంస్థలు కూడా భాగస్వామ్యం వహిస్తాయన్నారు. ఈ సమావేశంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ విభాగం ఏసిపి కృష్ణ ప్రసాద్, మేడ్చల్ జిల్లా శిశు సంక్షేమ శాఖా కమిటీ ప్రతినిధి రాజారెడ్డి, సంగారెడ్డి జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ డి. సాహితీ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా చిన్నారుల భవిష్యత్తును సురక్షితం చేస్తామని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# డంగల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం

**కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తిరుపతి రెడ్డి**





**బొంరాస్ పేట, జూలై 3(జనం సాక్షి):** కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తిరుపతి రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మెట్లకుంటలో గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని,బురాన్ పూర్,బొంరాస్ పేట, చౌదర్పల్లి లో అదనపు తరగతి గదులను,బురాన్ పూర్,కుబ్యా నాయక్ తండాలో అంగన్వాడీ భవనాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావ్యవస్థ బలోపేతానికి సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింలు గౌడ్,కొడంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్య గౌడ్,ఎంఈఓ హరిలాల్, ఎంపిడివో వేంకన్ గౌడ్,ఎంపిఓ రవి నాయక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అంజిల్ రెడ్డి,సర్పంచులు ఉమాదేవి,సుదర్శన్ రెడ్డి, వీరేశలింగం ,అనుష,కల్పన రెడ్డి, మల్లేష్, నరసింహనాయుడు, సంతోష్, భీమయ్య గౌడ్,గణపురం వెంకటయ్య గౌడ్,రాములు ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# తాండూర్లో బీజేపీ కౌన్సిలర్ల వినూత్న కార్యక్రమం

## కమిషనర్ చాంబర్లో ప్రధాని మోదీ చిత్రపటం

తాండూర్, జులై 3 జనంసాక్షి తాండూర్ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం బీజేపీ కౌన్సిలర్లు వినూత్న కార్యక్రమం చేపట్టారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటంతో మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ కు ఆ చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం కమిషనర్ చాంబర్లో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ ఫ్లోర్ లీడర్, 28వ వార్డు కౌన్సిలర్ నాగారం మల్లేశం, 23వ వార్డు కౌన్సిలర్ అంతారం కిరణ్ కుమార్, 33వ వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నా జీవితమే కాంగ్రెస్ పార్టీకి అర్పించాను

- **శరీరంలో ప్రవహించేది కాంగ్రెస్ పార్టీ రక్తం.**
- **రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ పదవి ఇప్పించాలని అధిష్టానానికి విజ్ఞప్తి**
- **కాంగ్రెస్ సీనియర్ నేత అయ్యగాళ్ళ భీమయ్య.**



**యాలాల జులై 3 ( జనంసాక్షి ) :** నా జీవితమే కాంగ్రెస్ పార్టీకి అర్పించానని, తన శరీరంలో ప్రవహించేది కాంగ్రెస్ పార్టీ రక్తమని.. మొదటి నుంచి పార్టీకి ఎంతో సేవ చేశానని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తనను గుర్తించి రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ పదవి ఇప్పించాలని వికారాబాద్ జిల్లా యాలాల మండలం కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అయ్య గాళ్ళ భీమయ్య విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, సిఎం సోదరుడు, కొడంగల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తిరుపతి రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డికి విన్నవించారు. వికారాబాద్ జిల్లా యాలాల మండలం తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన అయ్యగాళ్ల భీమయ్య ఎస్సీ వర్గానికి(దళితుడు ) చెందిన వారు. మాజీ మంత్రులు కీ. శే. మాణిక్ రావు, కీ. శే.చందు మహారాజ్, తాండూర్ మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీకి నమ్మిన బంటుగా పని చేశారు. గతంలో కాంగ్రెస్ నుంచి ఎంపీటిసి, అప్పటి మంత్రి సబితా రెడ్డి, తాండూర్ మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు, లక్ష్మారెడ్డి, డాక్టర్ సంపత్ కుమార్, అనిల్ కుమార్ సహకారాలతో డిసిఎంఎస్ డైరెక్టర్ గా ఎనిమిది ఏళ్లుగా పని చేయడం జరిగిందని భీమయ్య తెలిపారు. జూలై 2015 సంవత్సరం లో యాలాల్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గా నియమించారని, మండలం లో పార్టీకి విశేషంగా కృషి చేసి పార్టీని మండలంలో మొదటి స్థానంలో నిలబెట్టడం జరిగిందని వివరించారు. ఏ ఎన్నికలు వచ్చినా యాలాల మండలం నుంచి అత్యధిక మెజారిటీతో పార్టీ అభ్యర్థులను గెలిపించడం జరిగిందని పునరుద్ఘాటించారు . అదేవిదంగా ప్రతి పక్షంలో ఉండి కూడా యాలాల మండలంలో ఒక ఎంపీటీసీ, ఇద్దరు సర్పంచ్ లను పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజా వ్యతిరేక విధానాలపై అలుపెరుగని పోరాటం చేసినట్లు గుర్తు చేశారు. జిల్లాలోని యాలాల మండలం నుంచి 10,500మందిని మెంబర్ షిప్ చేయించడం జరిగిందని స్పష్టం చేశారు. టిపిసిసి ఆదేశాలతో తాండూర్ నుంచి కొడంగల్ వరకు పాదయాత్ర, యాలాల మండలం నుంచి కాంగ్రెస్ కార్యకర్తలతో ఆగష్టు 2022న డి సిసి అధ్యక్షులు రాంమోహన్ రెడ్డి, తదితరులతో కలిసి పాదయాత్ర కార్యక్రమాలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఇందిరమ్మ, రాజీవ్ గాంధీ జయంతి , వర్ధంతి ఉత్సవాలు, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అంబేద్కర్ తదితరుల జయంతి కార్యక్రమాలను సొంత ఖర్చులతో కార్యకర్తలు, సీనియర్ నాయకుల అండదండలతో జరుపుకోవడమే కాకుండా అనేక విధాలుగా కాంగ్రెస్ పార్టీకి స్వచ్ఛందంగా సేవ చేయడం జరిగిందని అయ్యగాళ్ల భీమయ్య తెలిపారు. ఇలా తన జీవితాన్ని కాంగ్రెస్ పార్టీకి అర్పించడం జరిగిందని చెప్పు కొచ్చారు. 2018లో కాంగ్రెస్ పార్టీకి అన్యాయం జరిగిందని.. ప్రస్తుతం 2024లో కాంగ్రెస్ అభ్యర్థి ని ఎమ్మెల్యేగా గెలిపించుకోవడం జరిగిందని అన్నారు. ఇలా అనేక విధాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవ చేసి, నా జీవితమే కాంగ్రెస్ పార్టీకి అర్పించడం జరిగిందని స్పష్టం చేశారు. సేవ చేసినందుకు తనకు రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ పదవి ఇప్పించాలని కాంగ్రెస్ అధిష్టానానికి సీనియర్ నేత అయ్యగాళ్ళ భీమయ్య ముక్త కంఠంతో విన్నవించారు.

# రామంతాపూర్‌కు ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

- ప్రజల సౌకర్యం, భద్రతను దృష్టిలో ఉంచి డీజీపీకి వినతి
- లక్ష మంది జనాభాకు సమీపంలో పోలీసు సేవలు
- హబ్సిగూడను కూడా కొత్త స్టేషన్ పరిధిలోకి చేర్చాలి
- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డిమాండ్




**ఉప్పల్, జూలై 3 (జనం సాక్షి):** ఉప్పల్ నియోజకవర్గంలోని రామంతాపూర్ డివిజన్‌కు ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సీవీ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రామంతాపూర్ డివిజన్‌లో సుమారు లక్ష మంది ప్రజలు నివసిస్తున్నారని, ప్రస్తుతం ఉప్పల్ మరియు ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉండటం వల్ల సేవలు సకాలంలో అందడం లేదని వివరించారు. విస్తారమైన భౌగోళిక పరిధి కారణంగా పోలీసు సిబ్బందిపై పనిభారం పెరిగి, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వేగంగా విస్తరిస్తున్న రామంతాపూర్ ప్రాంతంలో కొత్త కాలనీలు, నివాస సముదాయాలు, వాణిజ్య సంస్థలు ఏర్పడుతున్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక పోలీస్ స్టేషన్ అత్యవసరమని ఎమ్మెల్యే తెలిపారు. హబ్సిగూడ ప్రాంతాన్ని కూడా రామంతాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి తీసుకురావాలని డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్థానిక ప్రజలకు పోలీసు సేవలు మరింత సులభంగా, వేగంగా అందుబాటులోకి వస్తాయని వివరించారు.

మాదకద్రవ్యాల నియంత్రణ, సంఘవ్యతిరేక శక్తుల కట్టడి, మహిళలు, వృద్ధులు, విద్యార్థుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, నేరాల నివారణ వంటి అంశాల్లో ప్రత్యేక పోలీస్ స్టేషన్ కీలక పాత్ర పోషిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల సౌకర్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలించి, రామంతాపూర్ డివిజన్‌కు త్వరితగతిన ప్రత్యేక పోలీస్ స్టేషన్‌ను మంజూరు చేయాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను కోరారు. డీజీపీ సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో చర్చించి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కార్యాలయం వెల్లడించింది.

## దేశంలో తొలి ఉప్పు కలపని షాంపూను విడుదల చేసిన వాటిక

ఖైరతాబాద్, జూలై 03 (జనం సాక్షి) : డాబర్ ఇండి యా హెయిర్ కేర్ బ్రాండ్ వాటికా, భారతదేశపు తొలి 'ఉప్పు కలపని' షాంపూ శ్రేణి 'బయో ఇన్ఫ్యూ జన్స్'ను ప్రారంభించిందని డాబర్ ఇండియా లిమి టెడ్ గ్రూప్ ప్రొడక్ట్ మేనేజర్ గుర్దాతర్ సింగ్ రియా త్ శుక్రవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకట నలో పేర్కొన్నారు. డాబర్ ఇండియా లిమిటెడ్ కేట గరీ హెడ్-షాంపూస్, పోస్ట్ వాష్ అవతేజ్ సాహ్నీ తోకలసి అయన మాట్లాడుతూ ఈ శ్రేణిలో టస్కన్ రోజ్ మేరీ, జిన్సెంగ్, స్పానిష్ ఆలివ్స్, మొరాకన్ ఆర్గాన్ వంటి సహజ పదార్థాలతో పాటు ప్లాంట్ బయోటిన్ కాంప్లెక్స్, కొల్లాజెన్, హైలురోనిక్ యాసి డ్ వంటి ఆధునిక క్రియాశీల పదార్థాలను ఉపయో గించారని తెలిపారు. ప్రకృతి, విజ్ఞానం, పారదర్శక తను సమన్వయం చేసిన ఈ ప్రారంభం వాటికా వృద్ధి ప్రయాణంలో కీలక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. ఈ ప్రచారంలో నటి అయేషా ఖాన్, పరుల్ గులాటి, ఇషా మాల్వీయాతో పాటు 300 మందికిపైగా ఇన్ఫ్లుయెన్సర్లు పాల్గొన్నట్లు చెప్పా రు.

## ఉప్పల్ డివిజన్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పా రెడ్డి



**ఉప్పల్, జూలై 3: (జనం సాక్షి) :** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఈ రోజు ఉప్పల్ డివిజన్ అధ్యక్షులు మర్నేని ఫణేంద్ర ఆధ్వర్యంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పా రెడ్డి ఉప్పల్ డివిజన్ పరిధిలోని పలు పోలింగ్ బూత్‌లను సందర్శించి ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా శిల్పా రెడ్డి బీఎల్‌వోలతో మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా తమ ఓటు హక్కును కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఉప్పల్ డివిజన్ అధ్యక్షులు మర్నేని ఫణేంద్ర మాట్లాడుతూ, ఉప్పల్ డివిజన్‌లో ఇప్పటికే అనేక మంది ఓటర్లు నివాసాలు మారుతున్న పరిస్థితి ఉందని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ఒకే ఇంటి చిరునామాపై 30 నుంచి 50 వరకు ఓట్లు నమోదై ఉన్నాయని, అలాంటి కేసులను క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అలాగే ఓటరు జాబితా పూర్తిస్థాయిలో పారదర్శకంగా, ఖచ్చితంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



## నూతన ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును కలిసిన గజ్జి భాస్కర్ యాదవ్

**హయత్ నగర్, జూలై 3 (జనం సాక్షి)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజు ఐఏఎస్‌ను రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర యాదవ కోఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గజ్జి భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, సమర్థవంతమైన పరిపాలన, ప్రజా సంక్షేమ కార్యక్రమాల సమర్థ అమలులో ప్రధాన కార్యదర్శి నాయకత్వం రాష్ట్రాన్ని మరింత పురోగతి దిశగా నడిపిస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఆయన పదవీకాలం విజయవంతంగా సాగి, ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించాలని ఆకాంక్షించారు.

## పురాతన ఆలయాల పునర్నిర్మాణం అందరి బాధ్యత

- ప్రభుత్వ చీఫ్ పీప్ పట్నం మహేందర్ రెడ్డి
- దేవాలయం పూర్వ వైభవం, అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుంది



**షాబాద్, జులై 03(జనం సాక్షి) :** పురాతన ఆలయాలను పరిరక్షిస్తూ, వాటిని నూతన హంగులతో పునర్మించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రభుత్వ చీఫ్ వీప్ అన్నారు. మండల పరిధిలోని సీతారాంపూర్ లో శుక్రవారం సీతారామచంద్ర స్వామి దేవాలయ పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... దేవాలయాలు భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలని, వాటి సంరక్షణకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మండలంలోనే అతిపెద్ద దేవాలయముగా నిలిచి భక్తులకు దర్శనమిస్తూ విరాజిల్లుతున్న సీతారామచంద్ర స్వామి అని అన్నారు. దేవాలయం పేరా 100 కోట్ల ఆస్తులు ఉన్నాయని, మూడు కోట్ల తో ఆలయ గర్భగుడి పుననిర్మానం చేస్తున్నారని తెలుపుతూ, తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారి శ్రీనివాస్, సీతారాంపూర్ సర్పంచ్ పావని, మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సందీప్, నాయకులు చెన్నయ్య, సురేష్ గౌడ్, రాజు, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నర్సింలు, మంగలి రాజు పాల్గొన్నారు.

## ఆలయ పునః ప్రతిష్టాపన

**అంబర్పేట్ జూలై 3 (జనం సాక్షి):** ఆలయ పునః ప్రతిష్టాపన అనేది దేవత విగ్రహాన్ని ఆలయాన్ని పునరుద్ధరించి వేదమంత్రోచ్ఛరణాలతో దైవ శక్తి ని తిరిగి ప్రతిష్టించే పవిత్రమైన దైవ కార్యమ్ అని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శి యశ్వంత్ అన్నారు. అంబర్పేట్ పటేల్ నగర్,అన్నపూర్ణ కాలనీ శ్రీ శ్రీ నల్లపోచమ్మ అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు విశేష పూజలు దివ్య మంత్రాలను జపిస్తూ విగ్రహంలోకి అమ్మవారి ఆవాహన చేశారు. ఈ కార్యక్రమంలో బస్తివాసులు ఆలయ ధర్మకర్త మరియు సభ్యులు సేవక్ సింగ్,ఆత్రేయ, సురేష్, నరసింహ, యాదవ్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు

## పల్లెలన్నీ పల్లెలన్నీ పచ్చదనంతో కళకళలాడాలి

**రాజకీయాలకతీతంగా మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి**

**రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి కరణం కీర్తి రామకృష్ణ**



**మోమిన్ పేట జూలై 03 (జనం సాక్షి) :** పల్లెలన్నీ పచ్చదనంతో కళకళలాడాలని ప్రతి ఒక్కరూ రాజకీయాలకతీతంగా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి కర్ణం కీర్తి రామకృష్ణ పేర్కొన్నారు శుక్రవారం మోమిన్ పేట మండలంలోని కొత్త కోల్కొంద గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి ఒక్కరు జ్యోతి యువకులు ముందుకు వచ్చి నాటిన మొక్కలను సంరక్షించుకునే బాధ్యత వారిపైనే ఉందన్నారు, నేడు నాటిన మొక్కలు రేపటికి తరానికి,ఎంతో ఉపయోగపడతాయని, ఆమె సూచించారు, గ్రామంలోని వీటిలో గుండా ఇంటి పరిసరాల ప్రాంతాల్లో ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి మొక్కలు నాటే కార్యక్రమం విజయవంతంగా నిర్వహించాలని ఆమె అన్నారు, ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మహేందర్ రెడ్డి, వార్డు సభ్యులు పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

# తాండూరు అభివృద్ధే ఏకైక ఏజెండా

- కౌన్సిల్ సభ్యులు సమన్వయంతో పనిచేస్తేనే పట్టణ అభివృద్ధి వేగవంతం
- మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు అందరం కలిసి పని చేద్దాం
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు జులై 3(జనంసాక్షి) :** మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యులకు పలు కీలక సూచనలు చేశారు. తాండూరు పట్టణ అభివృద్ధి మనందరి బాధ్యత. ప్రజలకు మంచి చేయడమే మన ఏజెండాగా పని చేయాలి. మన కృషితో పాటు ప్రభుత్వానికి కూడా మంచి పేరు రావాలని అన్నారు.

కౌన్సిల్‌లో ప్రతిపక్షం, స్వపక్షం రెండూ ఉండాలని, అయితే రెండూ ప్రజల పక్షంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఏ ఒక్క వ్యక్తికీ వ్యక్తిగత మేలు జరిగేలా పనిచేయకూడదు. ఎన్నికల వరకే పార్టీ పరమైన పట్టింపులు. ప్రజలు మనకు అభివృద్ధి చేయడానికి అవకాశం ఇచ్చారు. వ్యక్తిగత కక్షసాధింపు రాజకీయాలతో ప్రజలకు సంతృప్తి కలగదని వ్యాఖ్యానించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను రాజకీయాలకు అతీతంగా పరిష్కరించాలని సూచించారు. మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు సమన్వయంతో పనిచేస్తేనే పట్టణ అభివృద్ధి వేగవంతం అవుతుందని తెలిపారు. తాండూరును అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం. తాండూరును మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు అందరం కలిసి పని చేద్దామని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంలో ప్రతి కౌన్సిలర్, కో-ఆప్షన్ సభ్యులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి పౌరుడు ఓటర్ జాబితాలో ఉండేలా కృషి చేయాలని, ప్రజల్లో అవగాహన పెంచి ప్రజాస్వామ్యాన్ని బలపరచాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, కమిషనర్ రాకేశ్ రెడ్డి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# నేడే ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం

- ఈ నెల 4 నుండి 12 వరకు వైద్య శిబిరం ఏర్పాటు..
- ప్రజలందరూ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు
- టాస్క్ సిఓఓ,ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సింకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**తలకొండపల్లి జూలై 03(జనంసాక్షి)**

పేద ప్రజలకు ఆరోగ్యవంతమైన జీవితాన్ని అందించడానికే ఐక్యత ఫౌండేషన్ ద్వారా ఉచిత కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు టాస్క్ సీఓఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు.రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో ఐక్యత ట్రస్ట్ ఆధ్వర్యంలో సుంకిరెడ్డి మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని దేవకీ గార్డెన్ లో ఈనెల 4 నుండి 12 వరకు ఏర్పాటు చేస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా సుంకిరెడ్డి మాట్లాడుతూ..కల్వకుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న పేద ప్రజలకు నాణ్యమైన ఉచిత కంటి వైద్య సేవలను అందించాలని లక్ష్యంతో గత రెండు సంవత్సరాలుగా మండలాల వారీగా ఇప్పటికే మాడ్గుల్, ఆమనగల్, వెల్దండ, కల్వకుర్తి, మండలాల్లో కంటి వైద్య శిబిరాలను నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల కోరిక మేరకే తలకొండపల్లిలో 5,వ కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్య శిబిరంలో చెన్నైకి చెందిన శంకర నేత్రాలయ ఆస్పత్రి వైద్యులు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి పూర్తిగా ఉచిత కంటి శుక్లాల శస్త్ర చికిత్సలు అందిస్తారని తెలిపారు. అలాగే అవసరమైన వైద్య సలహాలు,చికిత్సలు కూడా అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. క్యాంపులో ఉచిత కంటి పరీక్షలు జూలై 4 శనివారం నుండి జూలై 10 శుక్రవారం వరకు కొనసాగనున్నట్లు తెలిపారు.అలాగే ఉచిత కంటి శుక్లాల ఆపరేషన్లు జూలై 7 మంగళవారం నుండి జూలై 12 ఆదివారం వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు.ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని తలకొండపల్లి మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ముఖ్యంగా కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని తప్పకుండా వినియోగించుకోవాలని ఆయన కోరారు.ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలనే తపనతో ఐక్యత ఫౌండేషన్ ద్వారా ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలను అందించేందుకు కృషి చేస్తున్నామని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు.






## పరవశింపజేసిన 'పంచతంత్ర నృత్య కథలు'

**హైదరాబాద్, జూలై 03 (జనంసాక్షి):** శతాబ్దాల నాటి కథల జ్ఞానం నృత్యమై కదలివచ్చింది. అభినయమే భాషగా, హాస్య చమత్కారాలే హంగులుగా సాగిన ఈ 'పంచతంత్ర నృత్య కథలు' నృత్య రూపకానికి రవీంద్రభారతి వేదికైంది. ఈ నృత్య రూపకం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. హైదరాబాద్, బెంగళూరు నగరాలకు చెందిన ఇరవై మంది కళాకారులు ఈ ప్రదర్శనను రక్తికట్టించారు. భరతనాట్య నృత్య రీతులు, హావభావాలతో కూడిన ఈ ప్రదర్శన ఆద్యంతం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. హాస్యం, భావోద్వేగం, చమత్కారం, అద్భుతమైన విజువల్స్‌తో కథా సంప్రదాయాల గొప్పదనాన్ని చాటి చెప్పడమే కాకుండా, అందరిని అలరించింది. ప్రముఖ నృత్యకారిణి, పద్మశ్రీ డాక్టర్ ఆనంద శంకర్ జయంత్ అద్భుతమైన కొరియోగ్రఫీ, దర్శకత్వంలో శంకరానంద కళాక్షేత్ర సమర్పించిన ఈ సరికొత్త నృత్య నాటక ప్రదర్శన వీక్షకులను మంత్రముగ్ధులను చేసింది. భారత ప్రభుత్వ సంస్కృతి మంత్రిత్వ శాఖకు చెందిన 'అసిస్టెన్స్ టు కల్చరల్ ఆర్గనైజేషన్స్ విత్ నేషనల్ ప్రెజెన్స్' పథకం కింద ఈ కార్యక్రమానికి మద్దతు లభించింది. 78 నిమిషాల పాటు సాగిన ఈ వినూత్న ప్రదర్శనలో పంచతంత్రం నుంచి ఐదు ప్రసిద్ధ కథలను ప్రదర్శించారు. 'పంచతంత్ర నృత్య కథలు' పంచతంత్రంలోని ప్రసిద్ధ కథలకు నృత్య రూపంలో ప్రాణం పోసే ఒక అద్భుతమైన ప్రదర్శన ఇది. ఉపమానాలు, రూపకాల ద్వారా ఈ నృత్య నాటకం స్నేహం, శౌర్యం, సమయస్ఫూర్తి, మూర్ఖత్వం, నాయకత్వ లక్షణాలు, స్వేచ్ఛ వంటి విలువలు వివరించింది. హాస్యం, చమత్కారాలతో కూడిన ఈ నృత్య, నాటక ప్రదర్శనలో పంచతంత్రం నుంచి ఐదు ప్రసిద్ధ కథలు మన కళ్ళకు కట్టినట్లు చూపించారు. అడవికి రాజైన బలమైన సింహాన్ని తన తెలివితో ఓడించిన తెలివైన కుందేలు కథ, చెక్క దుంగ మధ్యలో ఉన్న మేకును లాగి తోకను ఇరికించుకున్న మూర్ఖపు కోతి కథ, కొంగలు తాబేలు కథ, దుష్ట మొసలి తెలివైన కోతి కథ, కిరాతకుడి వల నుంచి పావురాలు తప్పించుకునే కథలు అద్భుతంగా ఆవిష్కరించారు. ఎలాంటి సాహిత్యం లేని ఈ ప్రదర్శనకు ప్రముఖ సంగీత విద్వాంసులు, స్వరకర్త ప్రేమ రామమూర్తి సంగీతం అందించారు. ఈ నాటకానికి జయంతి ద్వారకానాథ్ ఆంగ్లంలో వ్యాఖ్యానం అందించగా, కాస్ట్యూమ్స్ గణేష్ నల్లారి, దీపా కృష్ణమాచారి, డిజిటల్ డిజైన్ గుంజన్ అష్టపుత్రే, లైటింగ్ సూర్యారావు అందించారు.

## రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ వ్యవస్థ ప్రారంభం




**ఖైరతాబాద్, జూలై 03 (జనం సాక్షి) :** చిత్తూరు జిల్లా పోగురుపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో ఏర్పా టు చేసిన 2 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్ వ్యవస్థను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఎస్ఎం రీఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్, పీఎం సూర్య ఘర్ మఫ్త్ బిజిలి యోజన కింద ఈ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేసింది. ఈ సోలార్ విద్యు త్ వ్యవస్థ ద్వారా 7,489 మంది ఎస్సీ, ఎస్టీ లబ్ధిదా రులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. గ్రామీణ స్థాయిలో ఏర్పాటు చేసిన ప్రముఖ రూఫ్ టాప్ సోలార్ విద్యుత్ ఉత్పాదక వ్యవస్థల్లో ఇది ఒకటిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసిన ఎస్ఎం రీ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ను అభినందించారు. సోలార్ ఇంధన వ్యవస్థల ఏర్పాటుకు మార్గదర్శకంగా నిలుస్తుంద ని అన్నారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన పీఎం సూర్య ఘర్ మఫ్త్ బిజిలి యోజన లక్ష్యాలకు అను గుణంగా ఈ ప్రాజెక్టు స్వచ్ఛ ఇంధన వినియోగాన్ని ప్రోత్సహిస్తూ, రాష్ట్రంలో రూఫ్‌టాప్ సోలార్ విస్త రణకు తోడ్పడుతుందని పేర్కొన్నారు.

## తాపీ మేస్త్రీలకు గిట్టుబాటు ధర కల్పించాలి

**తాపీ మేస్త్రీల సంఘం అధ్యక్షులు యాదయ్య సిహెచ్ రామూర్తి**



**ఫరూఖ్‌నగర్ (జనంసాక్షి) :** తాపీ మేస్త్రీలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని బ్లాక్ ఆఫీస్ కార్యాలయం నుండి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు అనంతరం సంఘం అధ్యక్షులు యాదయ్య ప్రధాన కార్యదర్శి సిహెచ్ రామూర్తి మాట్లాడుతూ చాలాకాలంగా తాపీ మేస్త్రీలు భవన నిర్మాణ కార్మికులు భవనాలపై నుండి కింద పడి ప్రాణాలు కోల్పోయారని అంగవైకల్యాలుగా మారారని వారికి ఇప్పటి వరకు న్యాయం జరగలేదని వారికి న్యాయం చేయాలని అదే విధంగా తాపీ మేస్త్రీలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా ప్రజలు ప్రభుత్వం అర్థం చేసుకొని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



## జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా డి.రఘురాములు

**నియామకం పట్ల హర్షం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నాయకులు**

**ఘనంగా సన్మానించిన తలకొండపల్లి ఆవాంచ నరసింహారెడ్డి**

**తలకొండపల్లి జూలై 03 (జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తలకొండపల్లి మాజీ ఎంపీపీ డి.రఘురాములు,ను తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆవాంచ నరసింహారెడ్డి,కాంగ్రెస్ నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో డి.రఘు రాములు సమర్థవంతంగా పనిచేసి పార్టీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఆవాంచ నరసింహారెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న నాయకులకు అధిష్ఠానం తగిన గుర్తింపు ఇస్తోందని అన్నారు.జిల్లా ప్రధాన కార్యదర్శిగా డి.రఘు రాములు నియామకం పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపిందని పేర్కొన్నారు.నూతన బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తూ జిల్లా వ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.డి.రఘు రాములు మాట్లాడుతూ..తనపై నమ్మకం ఉంచి జిల్లా ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి,కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,ఎంపీ డాక్టర్ మల్లురవి,లకు కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ ఆశయాలకు అనుగుణంగా కార్యకర్తలందరినీ కలుపుకొని పనిచేస్తూ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు కృషి చేస్తానని,పార్టీ బలోపేతమే తన ప్రధాన లక్ష్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో పోతుగంటి గణేష్,మీసేవ మల్లేష్,పురుషోత్తం,పోతుగంటి సురేష్,పెరమండ్ల శ్రీశైలం,బైండ్ల శేఖర్,రమేష్,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొని రఘురాములు,కు శుభాకాంక్షలు తెలిపారు.



## తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా కాసు శ్రీనివాస్ రెడ్డి ఎన్నిక

**తలకొండపల్లి జూలై 03(జనంసాక్షి) :** తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా మండల పరిధిలోని లింగరావుపల్లి గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి,ని నియమించినట్లు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండల అధ్యక్షుడిగా తనను నియమించిన పార్టీ అధిష్ఠానానికి,ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,ఎంపీ మల్లు రవి,కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి,లకు కృతజ్ఞతలు తెలిపారు.తనకు అప్పగించిన బాధ్యతను అత్యంత నిబద్ధతతో నిర్వహిస్తూ,మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి,పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కృషి చేస్తానని తెలిపారు.ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ,కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ అందరినీ కలుపుకొని ముందుకు సాగుతానని పేర్కొన్నారు.

# అంజయ్యనగర్ పార్కును పరిరక్షించండి

## మాదాపూర్ డిసికి జనం కోసం మెమొరాండం



**శేరిలింగంపల్లి, జులై 03 (జనంసాక్షి) :** సంవత్సరాలుగా రావణ కాష్టం లా రగులుతున్న మాదాపూర్ డివిజన్ అంజయ్య నగర్ పరిధి సర్వేనెంబర్ 134, 136 లోని ఒక ఎకరా 20 గుంటల పార్కు స్థలాన్ని కబ్జాకోరాల నుండి పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జనం కోసం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్ రెడ్డి మాదాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ కు మెమోరాండం ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూముల ధరలు విపరీతంగా కొండెక్కిన నేపథ్యంలో మాదాపూర్ డివిజన్ పరిధిలో భూ కబ్జాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయని, ప్రభుత్వ, ప్రైవేటు భూముల కబ్జాల తోపాటు ప్రస్తుతం తాజాగా ఆయా కాలనీలలో ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన పార్కు స్థలాలు సైతం కబ్జారాయులకు ఫలహారంగా మారుతుండడం ఆందోళన కలిగించే అంశమని, ఇలాంటి దారుణాలను అడ్డుకోకపోతే భవిష్యత్తులో చివరకు రోడ్లు సైతం కబ్జాలపరమైనా ఆశ్చర్యపోనక్కర్లేదని ఆయన ఎద్దేవా చేశారు. అంజయ్య నగర్ పార్కు స్థలంలో దళారులు, కబ్జారాయుళ్లు యదేచ్ఛగా పార్కు స్థలాన్ని దిగమింగుతున్నారని, ఇష్టానుసారంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని గతేడాది నవంబర్ 25వ తేదీన అప్పటి ఉప కమిషనర్ కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇదిగో అదిగో అంటూ కాలం వెల్లదీశారని, కనీసం ప్రస్తుత ఉప కమిషనర్ బాలకృష్ణ నైనా సదరు కబ్జాలను నిరోధించడంతోపాటు ప్రజా ప్రయోజనాలను పరిరక్షించాల్సిన కనీస బాధ్యతను కసిరెడ్డి గుర్తు చేశారు. ఎట్టి పరిస్థితులలోనూ ఎకరం 20 గుంటల భూమిలో గజం జాగాను కూడా దళారులకు దక్కనివ్వబోనని, రాను రాను ఇరుకుగా మారుతున్న ప్రజల జీవితంలో ఇలాంటి పార్కులే కొంత స్వాంతనను చేకూర్చే కీలక సదుపాయాలుగా మారుతాయని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అంజయ్య నగర్ పార్కును కబ్జా కోరలనుండి కాపాడి తీరుతానని ఆయన ధీమాను వ్యక్తం చేశారు. ప్రస్తుత కమిషనర్ బాలకృష్ణ కూడా సానుకూలంగా స్పందించారని, పార్కు స్థలాన్ని కాపాడినప్పుడే ఆయన చిత్తశుద్ధిని తాను విశ్వసిస్తానని ఈ సందర్భంగా కసిరెడ్డి భాస్కర్ రెడ్డి తేల్చి చెప్పారు.

## శంషాబాద్‌లో విద్యార్థిని అదృశ్యం



**రాజేంద్రనగర్, జూలై03 (జనంసాక్షి)** : రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం మదనపల్లి పాత తండాకు చెందిన 17 ఏళ్ల విద్యార్థిని వద్యా నీరజ ఈ నెల 28న ఇంటి నుంచి అదృశ్యమైనట్లు శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు అందింది. కుటుంబ సభ్యులు బంధువులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శంషాబాద్ ఇన్‌స్పెక్టర్ కె. నరేందర్ రెడ్డి తెలిపారు.

## హర్ ఘర్ జల్ జీవన్ మహోత్సవం అవగాహన కార్యక్రమం



**కొడంగల్, జూలై 03 (జనం సాక్షి)** కొడంగల్ మండలం ఉడిమేశ్వరం గ్రామంలో మిషన్ భగీరథ మరియు స్థానిక బోర్ల నీటి నమూనాలకు నాణ్యత పరీక్షలు నిర్వహించారు. అనంతరం హర్ ఘర్ జల్ జీవన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులకు సురక్షితమైన తాగునీటి వినియోగం, నీటిని పొదుపుగా ఉపయోగించాల్సిన అవసరం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుమ్మరి శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ శ్రీకాంత్, ల్యాబ్ టెక్నీషియన్లు, గ్రామపంచాయతీ కార్యదర్శి రమేష్, వ్యవసాయ శాఖ ఎఈఓ భావన, వార్డ్ సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఫ్లిప్‌కార్ట్ గోట్ సేల్‌లో ఏఐ ప్లస్ ఉత్పత్తులకు భారీ ఆఫర్లు

**ఖైరతాబాద్, జూలై 03 (జనంసాక్షి) :** ఫ్లిప్‌కార్ట్ గోట్ సేల్ సందర్భంగా ఏఐ ప్లస్ తన స్మార్ట్‌ఫోన్‌లు, ఏఐ ఓటీ ఉత్పత్తులపై ప్రత్యేక ధరలను ప్రకటించినట్లు ఏఐ ప్లస్ స్మార్ట్‌ఫోన్, ఎన్‌ఎక్స్‌టీక్యువాంటమ్ టెక్నా లజీస్ సీఈఓ మాధవ్ శేథ్ శుక్రవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫ్లిప్ కార్ట్ ప్లస్ కస్టమర్లకు జూలై 3 నుంచే సేల్ యాక్సెస్ ఉండగా, ఈనెల 4 నుంచి అన్ని వినియోగదారుల కు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ సేల్‌లో ఏఐ ప్లస్ పల్స్ 2 స్మార్ట్‌ఫోన్‌ను రూ. 8,999 ప్రత్యేక ధరకు అందిస్తున్నట్లు చెప్పారు. నోవా సిరీస్, వేరబుల్స్, ఆడియో ఉత్పత్తులు, టాబ్లెట్ లపై కూడా ఆకర్షణీయమైన ఆఫర్లు ఉన్నాయని తెలిపారు. మరింత మంది వినియోగదారులు ఏఐ ప్లస్ ఎకోసిస్టమ్‌ను అనుభవించేలా ఈ ఆఫర్లు దోహద పడతాయని తెలిపారు.



## కుల్కచర్ల సొసైటీ చైర్మన్‌గా బొలుసాని భీమ్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ

### రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి : పరిగి ఎమ్మెల్యే టిఆర్ఆర్

**కుల్కచర్ల,జూలై 03(జనం సాక్షి):** కుల్కచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్)నూతన పాలకవర్గం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి హాజరై నూతన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బొలుసాని భీమ్ రెడ్డి పీఏసీఎస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయగా,ఎల్పటి అశోక్ కుమార్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..నూతన పాలకవర్గం రైతులకు మరింత సమర్థవంతమైన సేవలు అందిస్తూ,సహకార సంఘ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. రైతుల సంక్షేమం,వ్యవసాయాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. నూతన చైర్మన్ భీమ్ రెడ్డి మాట్లాడుతూ..రైతులకు ఎల్లవేళల అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించి సొసైటీ బ్యాంకును బలోపే తం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏస్-కాటో జాయింట్ వెంచర్‌కు శ్రీకారం

**ఖైరతాబాద్, జులై 03 (జనం సాక్షి) :** భారత నిర్మాణ పరికరాల తయారీ సంస్థ యాక్షన్ కన్స్ ట్రక్షన్ ఎక్విప్మెంట్ లిమిటెడ్(ఏస్), జపాన్‌కు చెంది న కాటో వర్క్స్ కంపెనీ లిమిటెడ్ సంయుక్తంగా 50:50 భాగస్వామ్యంతో ఏస్ కాటో ప్రైవేట్ లిమి టెడ్ పేరుతో కొత్త జాయింట్ వెంచర్‌ను ప్రకటించిన ట్లు ఏస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోరబ్ అగర్వాల్ శుక్రవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ హర్యానా లో 11 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ. 200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న ఈ యూనిట్‌లో ట్రక్ క్రేన్లు, క్రాలర్ క్రేన్లు, రఫ్ టెరైన్ క్రేన్లను తయారు చేయనుండగా, భవిష్యత్‌లో మరిన్ని క్రేన్ మోడళ్ల ను ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. దేశీయ మార్కెట్ తో పాటు ప్రపంచ మార్కెట్లకు కూడా ఉత్పత్తులను సరఫరా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయని తెలిపారు. జపనీస్ సాంకేతికతను భారత తయారీ సామర్థ్యాలతో మేళవించి అధిక సామర్థ్యం గల క్రేన్ తయారీకి ప్రపంచ స్థాయి వేదికను రూపొందిస్తు న్నామని తెలిపారు. కాటో వర్క్స్ డైరెక్టర్ టోమో యసు కాటో మాట్లాడుతూ ఏస్ యొక్క తయారీ సామర్థ్యాలు, సరఫరాదారుల వ్యవస్థ, మార్కెట్ నెట్‌వర్క్‌తో కలిసి భారతదేశాన్ని కీలక క్రేన్ తయా రీ కేంద్రంగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.



## ప్రభుత్వ స్థలంలో నిర్మాణానికి అనుమతుల రద్దు

### వాస్తవాలు దాచినట్లు నిర్ధారణ.. పనులు నిలిపివేయాలని ఆదేశాలు

**అల్వాల్, జులై 03(జనంసాక్షి):** టెంపుల్ అల్వాల్‌లో ప్రభుత్వ స్థలంలో నిర్మాణానికి ఇచ్చిన అనుమతులను జీహెచ్ఎంసీ మల్కాజ్‌గిరి మండల కమిషనర్ రద్దు చేశారు. వాస్తవాలను దాచిపెట్టి నిర్మాణ అనుమతులు పొందినట్లు విచారణలో తేలడంతో ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని ఆదేశించారు. టెంపుల్ అల్వాల్ పరిధిలోని ఇంటి నంబరు 1-9-62/5లో 420 గజాల స్థలంలో నిర్మాణం చేపట్టిన విషయమై టీపీసీసీ ప్రతినిధి ఏ. అశోక్ కుమార్ ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు విచారణ చేపట్టగా, ఆ స్థలం గ్రామకంఠం ప్రభుత్వ భూమిగా తేలింది. గతంలో అక్కడ ప్రభుత్వ చేతి పంపు, ప్రజల మరుగుదొడ్లు ఉన్నట్లు అధికారిక దస్త్రాలు వెల్లడించాయి. భూమి వివరాల ధ్రువపత్రంలో పశ్చిమ సరిహద్దుగా ప్రజల మరుగుదొడ్డి (కూల్చివేయబడింది) అని నమోదై ఉండటం, మండల సర్వేయర్ రూపొందించిన పటంలో ప్రభుత్వ భూమిగా చూపించడం, పాత చిత్రాల్లో కనిపించిన ఆనవాళ్లు తదితర ఆధారాలను అధికారులు పరిశీలించారు. దరఖాస్తుదారులు 2016కు ముందునాటి యాజమాన్య పత్రాలు సమర్పించకపోవడంతో పాటు 1968 నాటి అనుసంధాన పత్రంలోనూ లోపాలు ఉన్నట్లు విచారణలో గుర్తించారు. దీంతో 2025 మార్చి 29న జారీ చేసిన నిర్మాణ ప్రారంభ అనుమతి, 2026 ఫిబ్రవరి 11న ఇచ్చిన సవరించిన నిర్మాణ అనుమతిని 2026 జూన్ 30న జారీ చేసిన ఉత్తర్వుల ద్వారా రద్దు చేశారు. నిర్మాణ పనులను నిలిపివేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## మండల అధ్యక్ష పదవుల్లో బీసీలకు సముచిత ప్రాధాన్యం కల్పించాలి

### బిసి యువ నాయకులు వద్ల వెంకటేశం చారి



**ధారూర్, జూలై 3(జనంసాక్షి) :** రాష్ట్రంలో సామాజిక న్యాయం,సమాన అవకాశాల గురించి అన్ని రాజకీయ పార్టీలు మాట్లాడుతున్నప్పటికీ, పదవుల కేటాయింపులో మాత్రం బీసీ వర్గాలకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదని ధారూర్ మండలానికి చెందిన బీసీ నాయకులు, యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధారూర్ మండల అధ్యక్ష పదవుల నియామక ప్రక్రియలో బీసీ నాయకులను పరిగణనలోకి తీసుకోవాలని వారు రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకత్వాలను కోరారు. మండల స్థాయిలో పార్టీల అభివృద్ధి కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి పనిచేస్తున్న బీసీ నాయకులకు ఇప్పటికీ నాయకత్వ బాధ్యతలు అప్పగించకపోవడం నిరాశకు గురిచేస్తోందని పేర్కొన్నారు.

ఎన్నికల సమయంలో బీసీ వర్గాల ఓట్ల కోసం ప్రతి రాజకీయ పార్టీ ముందుకు వస్తున్నప్పటికీ,పదవుల పంపిణీ సమయంలో మాత్రం అదే వర్గాన్ని విస్మరిస్తున్నారని వారు విమర్శించారు. బీసీలు కేవలం ఓటు బ్యాంకు మాత్రమే కాదని,పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే శక్తిగా గుర్తించాలని కోరారు. కాంగ్రెస్,బీఆర్ఎస్, బీజేపీ వంటి ప్రధాన రాజకీయ పార్టీలు సామాజిక సమతుల్యతను పాటిస్తూ బీసీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. అర్హత, అనుభవం,పార్టీ పట్ల నిబద్ధత ఉన్న బీసీ నాయకులకు మండల అధ్యక్ష పదవులు అప్పగిస్తే పార్టీలకు మరింత బలం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. బీసీ నాయకులను నిరంతరం విస్మరించడం వల్ల కార్యకర్తల్లో అయోమయం, అసంతృప్తి పెరుగుతోందని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర, జిల్లా నాయకత్వాలు స్పందించి ధారూర్ మండల అధ్యక్ష పదవిని బీసీ వర్గానికి చెందిన సమర్థ నాయకుడికి కేటాయించాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం నినాదాలతోనే పరిమితం కాకుండా,పదవుల పంపిణీలోనూ ఆచరణలో చూపించాలని,అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించినప్పుడే రాజకీయ పార్టీలపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుందని బీసీ నాయకులు,యువత అభిప్రాయం వ్యక్తం చేశారు.



# అధిష్టానం నిర్ణయానికే కట్టుబడి పనిచేస్తా

## రాజకీయంగా కాకుండా వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తే ఖబర్దార్

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రావుగారి వెంకట్‌రెడ్డి

**నవాబ్‌పేట్ జులై 03 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తీసుకునే నిర్ణయానికి పూర్తిగా కట్టుబడి ఉంటానని కాంగ్రెస్ పార్టీ నవాబు పేట్ నూతన మండల అధ్యక్షులు రావుగారి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం నవాబుపేట మండలంలో పత్రిక సమావేశాన్ని పిఎసిఎస్ చైర్మన్ రామ్ రెడ్డి,ఏఎంసీ చైర్మన్ రాథోడ్ గీత సింగ్,సర్పంచ్ సంఘం అధ్యక్షులు బల్వంత్ రెడ్డిలతో కలిసి నూతన మండల అధ్యక్షులు రావుగారి వెంకట్ రెడ్డి నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయంగా ఏమైనా ఉంటే ఎదుర్కొండి కానీ వ్యక్తిగతంగా తమను కానీ, ఎమ్మెల్యేను కానీ దూషిస్తే సహించేది లేదని మండిపడ్డారు.ఎమ్మెల్యే పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఖబర్దార్ అంటూ విమర్శలు చేసిన వారిని హెచ్చరించారు.నవాబు పేట్ మండలంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం ఎమ్మెల్యేనే.మండలంలో ఉన్న నాయకులకు రాజకీయం చెప్పిన వ్యక్తిపై నిరాధారణ వ్యాఖ్యలు చేయడం సరికాదని తెలియజేశారు.గతంలో మేము కూడా కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నామనే విషయాన్ని మర్చిపోయి స్థాయికి తగని మాటలు మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఏదేవా చేశారు.గతంలో మేము కాంగ్రెస్ పార్టీలో ఉన్నాము సొంత గూటికి తిరిగి వస్తే జీర్ణించుకోలేక అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా ప్రజల విశ్వాసాన్ని పొందిన కాలే యాదయ్య నాయకత్వంలోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమైందని అన్నారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడి నియామకం ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిర్ణయం మేరకే జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ ఖదీర్,సర్పంచ్ జగన్ రెడ్డి,సీనియర్ నాయకులు నాగిరెడ్డి,ప్రభాకర్,మాణిక్యం, ప్రకాష్, రవీందర్, గోపాల్,మల్లేషం,బాగ రెడ్డి,బుచ్చి రాములు,తదితరులు పాల్గొన్నారు.

# పోచంపల్లి డబుల్ బెడ్ రూమ్‌లలో 'ఫ్రైడే డ్రై డే' అవగాహన




**నిజాంపేట్, జూలై 3 (జనంసాక్షి) :** సిఎంసి దుండిగల్ 59 సర్కిల్ డి. పోచంపల్లి బెడ్ రూమ్ లో శుక్రవారం స్థానిక పరిశుభ్రతపై ఫ్రైడే డ్రై డే అవగాహన కార్యక్రమం దుండిగల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్ వెంకట మణికరం నిర్వహించారు. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రవలి ప్రబలే వ్యాధులు ప్రధానంగా డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ, దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి, వాటిని సకాలంలో నిర్మూలించడమే ఈ 'ఫ్రైడే – డ్రై డే' కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. కుండీలు, పాత టైర్లు, వాడలేని పాత్రలు మరియు నీటి ట్యాంకులలో నిల్వ ఉన్న నీటిని క్రమం తప్పకుండా తొలగించాలని, తద్వారా దోమల వ్యాప్తిని అరికట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఆయన సూచించారు. పరిసరాల పరిశుభ్రత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.సాలిడ్ వెస్ట్ మేనేజ్మెంట్ సిబ్బంది కాలనీలో చెత్తను సేకరించి, వ్యర్థాల నిర్వహణపై స్థానికులకు అవసరమైన సూచనలు జారీ చేశారు. ఎంటమాలజీ విభాగం వారు దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు ఈ కార్యక్రమంలో సాలిడ్ వెస్ట్ మేనేజ్మెంట్ డిప్యూటీ ఇంజనీర్ అన్వేష్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ అశోక్ కుమార్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ సాత్విక్, మరియు ఎంటమాలజీ సెక్షన్ నుండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# రాజకీయ సభలు కాదు, స్థానిక యువతకు ఉద్యోగాలు కావాలి

## కరాటే రాజు నాయక్



**సికింద్రాబాద్(జనంసాక్షి):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించనున్న కృతజ్ఞతా సభకు బదులుగా మిడ్జిల్, ఊర్కొండ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఓయూ జేఏసీ చైర్మన్ డాక్టర్ కరాటే రాజు నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2006లో మిడ్జిల్ మండలం నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన రేవంత్ రెడ్డి, తన రాజకీయ జీవితానికి పునాది వేసిన ఆ ప్రాంతాలకు ఇప్పటివరకు చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చెప్పాలన్నారు. అక్కడ ఉన్న తండాలలో కనీసం మౌలిక సదుపాయాలు కరువయ్యాయని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లేదని, స్థానిక యువతకు ఉద్యోగాలు కూడా కల్పించలేదన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించకుండా వేలాది మందితో కృతజ్ఞతా సభ నిర్వహించడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని పేర్కొన్నారు. మిడ్జిల్, ఊర్కొండ మండలాల సమగ్ర అభివృద్ధికి రూ. 1,000 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటిస్తేనే అది నిజమైన కృతజ్ఞత అవుతుందని ఆయన పేర్కొన్నారు. రాజకీయంగా వెంట నడిచిన స్థానిక యువత ఇప్పటికీ నిరుద్యోగులుగానే ఉన్నారని, అక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేసి వారికి ఉద్యోగాలు కల్పించాలని కోరారు. రెండు మండలాల్లో రహదారులు, తాగునీటి సౌకర్యం, డ్రైనేజీ, ఆధునిక ప్రభుత్వ పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, డిజిటల్ మౌలిక వసతులు కల్పించాలన్నారు.

అదేవిధంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు, పీజీ కేంద్రాలు, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

# భద్రావతి చేనేత సహకార సంఘం నూతన అధ్యక్షురాలిగా వరకాల ప్రమీల



**రాజేంద్రనగర్,జూలై3(జనంసాక్షి) :** శ్రీ భద్రావతి హ్యాండ్లూమ్ కో–ఆపరేటివ్ సొసైటీ నూతన పాలకవర్గ ఎన్నికలు సహకార శాఖ సీనియర్ ఇన్స్పెక్టర్, ఎన్నికల అధికారి విజయ్ సింహ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించగా, అధ్యక్షురాలిగా వరకాల ప్రమీల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా నాడెపు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పాశికంటి రమేష్, కోశాధికారిగా పగిడిమర్రి సూర్యనారాయణ ఎన్నికయ్యారు. వరకాల ప్రమీల మాట్లాడుతూ దివంగత కొండా లక్ష్మణ్ బాపూజీ, సిలివేరి ప్రహ్లాద్ ఆశయాలకు అనుగుణంగా చేనేత కార్మికుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. చేనేత రంగానికి ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందించాలని కోరారు. అనంతరం నూతన పాలకవర్గానికి సహకార శాఖ సీనియర్ ఇన్స్పెక్టర్ విజయ్ సింహ ధ్రువీకరణ పత్రాలు అందజేయగా, చేనేత కార్మికులు నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు.

# వర్షాలు సమృద్ధిగా కురవాలని మక్కా మస్జీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు

**కొడంగల్, జూలై 03 (జనం సాక్షి) :** కొడంగల్ పట్టణ కేంద్రంలో మక్కా మస్జీద్ లో శుక్రవారం వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షిస్తూ మైనారిటీ నాయకులు ఎస్ఎమ్, గౌసన్ ఆధ్వర్యంలో ఇమామ్ అబ్దుల్ కరీం అశ్రఫీ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.వర్షాకాలం ప్రారంభమైనా వర్షాల జాడ కనిపించడం లేదని, వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



# పంచాయతీ కార్యదర్శులకు సన్మానం



**కేశంపేట, జూలై 3(జనంసాక్షి) :** మండల పరిధిలోని పుట్టోని గూడ గ్రామపంచాయతీ లో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి బదిలీ అయిన అలివేల, ఇన్చార్జిగా విధులు నిర్వహించిన సందీప్ తో పాటు కొత్తగా విధుల్లోకి చేరిన పంచాయతీ కార్యదర్శి మహేష్ ను గ్రామ పాలకవర్గం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కె చప్లి భాస్కర్ నాయక్ మాట్లాడుతూ.. బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శి అలివేల భవిష్యత్తులో మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. కొత్తగా విధుల్లో చేరిన మహేష్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ గ్రామానికి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పెద్దిని విజయమ్మ కృష్ణయ్య, నాయకులు జంగ ప్రవీణ్, జంగ లింగమయ్య , పట్నం రాజు, సదానందం గౌడ్ పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలించిన అదనపు సీఈఓ డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి



**రాజేంద్రనగర్, జూలై3 (జనంసాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నార్సింగ్ సర్కిల్ 45లో తెలంగాణ ఎన్నికల సంఘం అదనపు సీఈఓ డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. పోలింగ్ స్టేషన్లు 8, 10, 145లను సందర్శించి బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి, ఏఎంసీ దేవేందర్, సూపర్వైజర్లు పాల్గొన్నారు. జూలై 24 వరకు కొనసాగే ఎస్ఐఆర్ కార్యక్రమంలో ప్రతి ఓటరు సంబంధిత బీఎల్ఓల నుంచి ఎన్యూమరేషన్ ఫారాలు తీసుకుని పూర్తి చేసి సకాలంలో సమర్పించాలని అధికారులు సూచించారు.




# మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని కలిసిన నూతన డివిజన్ నాయకులు

**నిజాంపేట్, జులై 3 (జనంసాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన పలు డివిజన్ అధ్యక్షులు మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతిరెడ్డి ని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ డివిజన్ నాయకులు కలిసినవారు పెటబషీరాబాద్ డివిజన్ అధ్యక్షులు బండి శ్రీనివాస్ గౌడ్, కొంపల్లి డివిజన్ అధ్యక్షులు ఆదిరెడ్డి మోహన్ రెడ్డి ,నిజాంపేట్ డివిజన్ అధ్యక్షులు కోటపాటి మురళి,బాచుపల్లి అధ్యక్షులు కోలన్ జీవన్ రెడ్డి,ప్రగతినగర్ డివిజన్ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి (తాతి రెడ్డి ), మహాదేవపురం డివిజన్ అధ్యక్షులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, కుత్బుల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్ ముదిరాజ్, దూలపల్లి డివిజన్ అధ్యక్షులు బైరి శివ కుమార్ గౌడ్,షాపూర్ నగర్ డివిజన్ అధ్యక్షులు పాలకృష్ణ, బౌరంపేట్ డివిజన్ అధ్యక్షులు అర్కల విజయ్ గౌడ్, దుండిగల్ డివిజన్ అధ్యక్షులు జక్కుల మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా మరోసారి బాధ్యతలు స్వీకరించిన మన్నే శంకర్ యాదవ్‌కు సన్మానం



**మోమిన్‌పేట, జూలై 03 ( జనం సాక్షి) :** మోమిన్ పేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా తిరిగి పదవి బాధ్యతలు చేపట్టిన మన్నే శంకర్ యాదవ్ కు దుర్గం చెరువు గ్రామంలో శుక్రవారం, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కృష్ణ దుర్గం చెరువు గ్రామ కమిటీ అధ్యక్షులు గౌండ్ల సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు, ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మన్నే శంకర్ యాదవ్ మాట్లాడుతూ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా అవకాశం కల్పించిన మండల స్థాయి సీనియర్ నాయకులకు, తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ కు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ధారాసింగ్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు, మండలంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ అభ్యర్థుల విజయానికి తన వంతు సహకారం అందిస్తానని మండలంలో ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని ఆయన అన్నారు, ఈ కార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ రెడ్డి, మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు కోసిగి సురేందర్, మండలంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గ్రామ కమిటీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**షాబాద్, జులై 03(జనంసాక్షి) :** ప్రజల అవసర సమయంలో ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించే ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగపడుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలానికి చెందిన 22 మంది లబ్ధిదారులకు శుక్రవారం ఎమ్మెల్యే తో కలిసి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పేద మధ్య తరగతి కుటుంబాలకు అనారోగ్యం వంటి అత్యవసర పరిస్థితుల్లో సీఎంఆర్ఎఫ్ ఎంతో ఊరట నిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్దార్ నగర్ మార్కెట్ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, సర్పంచులు ప్రభాకర్ రెడ్డి, గుండాల అశోక్, రాజేందర్ రెడ్డి, మాణిక్యం, గోపాల్, మాజీ ఎంపీటీసీ సభ్యులు కుమ్మరి చెన్నయ్య, పార్టీ నాయకులు గోవర్ధన్ రెడ్డి, గోపాల్, జనార్దన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కాజా మియా, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌బీ నగర్ ఓల్డ్ విలేజ్‌లో ఇందిరమ్మ చీరల పంపిణీ



**హయత్ నగరర్, జూలై 3 (జనంసాక్షి) :** ఎల్‌బీ నగర్ ఓల్డ్ విలేజ్‌లో నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు ఎం.డి. జానీమియా సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్హులైన మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి పేద కుటుంబానికి చేరేలా నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. పేద మహిళలకు అండగా నిలుస్తూ ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## ఒక్క అర్హుడూ మిస్ కావొద్దు

### (సర్ )లో పాల్గొన్న గ్రామ సర్పంచ్ చంద్రకళ, శ్రీనివాస్

**పెద్దేముల్, జులై03 (జనంసాక్షి) :** ఓటు హక్కు ఉన్న ఒక్క అర్హుడూ మిస్ కావొద్దు అని పెద్దేముల్ మండలం తింసాన్ పల్లి సర్పంచ్ గుడిసె చంద్రకళ శ్రీనివాస్,టిపిసిసి రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ రియాజ్ స్పష్టం చేశారు.శుక్రవారం గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక సమగ్ర సవరణ సర్ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ తిరిగి ఓటరు జాబితాను పరిశీలించారు.ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రకళ శ్రీనివాస్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే మా ప్రథమ కర్తవ్యం. యువత, మహిళలు, వృద్ధులు.. ఎవరి పేరు కూడా జాబితాలో మిస్ కావొదని అన్నారు. జాబితాలోని లోపాలను సరిదిద్దాలని మరణించిన వారి పేర్లు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు, డబుల్ ఎంట్రీలు వెంటనే తొలగించాలని తెలిపారు. ఓటరు జాబితా 100% స్వచ్ఛంగా ఉండాలి. ఇది ప్రభుత్వ ఆదేశం మాత్రమే కాదు, ప్రజాస్వామ్య బాధ్యత కూడా" అని పేర్కొన్నారు. దాంతోపాటు గ్రామంలో కొత్తగా ఓటు హక్కు వచ్చిన యువతకు ఫామ్-6 అందజేసి నమోదు ప్రక్రియను పూర్తి చేయించారు. "ఓటు మీ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. తప్పకుండా నమోదు చేసుకోండి" అని యువతకు పిలుపునిచ్చారు. చిరునామా మార్పులు, ఇతర తప్పుల సవరణకు ఫామ్-8ను వినియోగించుకోవాలని సూచించారు.అలాగే బీఎల్ఓలు ఎలాంటి పక్షపాతం లేకుండా, పారదర్శకంగా పనిచేయండి. ప్రతి ఇంటినీ సందర్శించండి. మీకు పూర్తి సహకారం అందిస్తా. ఎవరైనా అడ్డుకుంటే వెంటనే నాకు చెప్పండి అని భరోసా ఇచ్చారు.గ్రామంలో సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గ్రామ పంచాయతీ పూర్తి సహకారం అందిస్తుందని, ప్రజలందరూ తమ ఓటు హక్కును సరిచూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు గ్రామ కమిటీ అధ్యక్షుడు అనీఫ్, ఉపాధ్యక్షుడు రవి, బి ఎల్ వో ఉమాదేవి, బి ఎల్ ఏ లు బుద్ధారం నాగేష్, బంటు రమేష్, నాయకులు వెంకట్, నర్సింలు, ఈశ్వర్, హనుమప్ప మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి విద్యార్థి అదృశ్యం



**బొంరాస్‌పేట, జూలై 3(జనంసాక్షి):** మండల పరిధిలోని బాపన్ చెరువు తండాకు చెందిన రాథోడ్ మహేష్ (16) రేగడి మైలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు.ఈనెల 2న బాలుడు పాఠశాలకు చదువుకునేందుకు ఉదయం వెళ్లి, సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చాడు.అనంతరం ఆడుకోవడానికి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు.కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వాళ్ల దగ్గర వెతికిన ఆచూకీ లభ్యం కాలేదు.దీంతో శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై బాల వెంకటరమణ తెలిపారు. ఈ ఫోటోలోని బాలుడి ఆచూకీ తెలిసినవారు వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్ లేదా బొంరాస్ పేట పోలీస్ స్టేషన్ ఫోన్, 8712670047, 8712543273 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.



## వెయింగ్ బ్రిడ్జి ప్రారంభించిన మాజీ మేయర్ అజయ్ యాదవ్



**బోడుప్పల్-జనంసాక్షి :** బోడుప్పల్ సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధునిక వెయింగ్ బ్రిడ్జిని మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, వెయింగ్ బ్రిడ్జిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అజయ్ యాదవ్ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికతతో ఏర్పాటు చేసిన వెయింగ్ బ్రిడ్జి రవాణా, పారిశ్రామిక రంగాలకు ఎంతో ప్రయోజనకరంగా నిలుస్తుందని తెలిపారు. ఇటువంటి సంస్థలు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రాంత ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. సంస్థ యాజమాన్యం నాణ్యమైన సేవలు అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ డివిజన్ అధ్యక్షుడు బొమ్మకు కళ్యాణ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు రసాల వెంకటేష్ యాదవ్, చీరాల నరసింహ, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, గుర్రాల వెంకటేష్ యాదవ్, తోటకూర రవీందర్ యాదవ్, వల్లపు ఐలేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంస్థ యాజమాన్యం పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా బాకారం వెంకట్ రెడ్డి



**మొయినాబాద్, జూలై 03 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ నూతన జిల్లా కమిటీలో బాకారం వెంకట్రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులైయ్యారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ ?కుమార్ గౌడ్ జిల్లా నూతన కమిటీని నియమిస్తు ఉత్తర్వులు జారీ చేయడంతో ఉపాధ్యక్షునిగా వెంకట్రెడ్డి నియమితులు కావడంతో ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి ఎప్పటికైనా పదవులు వరిస్తాయని అన్నారు. మహేష్కుమార్గౌడ్, జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహ్మారెడ్డి, నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు తనకు జిల్లా ఉపాధ్యక్షులుగా పదవిని కల్పించినందుకు కృతజ్ఞతలు తెలువుతూ సంతోషం వ్యక్తం చేశారు. తనపై మరింత భారం పెంచారని కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం నాయకులు, కార్యకర్తలతో కలిసి పని చేస్తానన్నారు. ఈ పదవి మరింత బాధ్యత పెంచిందని పేర్కొన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



**మర్పల్లి, జూలై 03 (జనంసాక్షి)** సీఎం సహాయనిధి పేదల పాలిట వరమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురేష్ యాదవ్, మర్పల్లి గ్రామ సర్పంచ్ రామేశ్వర్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రఫీయుద్దీన్, సుభాష్ యాదవ్ అన్నారు. శుక్రవారం మర్పల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల పరిధిలోని గ్రామాలకు చెందిన 65 మందికి సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందజేసే సహాయనిధి సద్వినియోగం చేసుకోవాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రభు, నర్సింలు యాదవ్, శేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ పాండు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.